క్లుప్తంగా

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



తొండపాడులో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

గుత్తి రూరల్: గ్రామాల్లో చిన్నపాటి విషయాలకు అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సురేష్ హెచ్చరించారు. శనివారం ఫ్యాక్షన్ గ్రామమైన తొండపాడులో పోలీసులు కార్డెన్ సెర్చ్, గ్రామ సభ నిర్వహించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా సహకరించాలని గ్రామస్తులకు ఎస్ఐ సూచించారు. అనంతరం గ్రామంలో అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. పాత కేసుల్లో నిందితులు, పశువుల పాకలు, గడ్డి వాములు, దుకాణాలలో తనిఖీ చేశారు. బెల్టు దుకాణాలు ఏర్పాటు చేసినా, మద్యం అక్రమంగా విక్రయించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే జైలు శిక్ష తప్పదన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు నీలకంఠ, రమేష్‌నాయక్, హోమ్‌గార్డ్ రఫీ పాల్గొన్నారు.

ఘనంగా 'స్వచ్ఛ దివస్'



చీపుర్లతో రోడ్డు ఊడుస్తున్న గేట్స్ పాలిటెక్నిక్ విద్యార్థులు

గుత్తి: స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహులు, మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషా, గేట్స్ పీడీ జోయెల్ విజయానంద్ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ సర్కిల్ వద్ద నుంచి రాయల్ సర్కిల్ వరకు రోడ్లు, పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం గాంధీ సర్కిల్ వద్ద మానవ హారం చేపట్టి వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేశారు.

పప్పుశనగలో పంట కోత ప్రయోగాలు



కోమటికుంట్లలో పప్పుశనగ పొలంలో పంటకోత ప్రయోగం చేస్తున్న అధికారులు

పుట్లూరు: మండలంలోని కడవకల్లు, పుట్లూరు, కోమటికుంట్ల గ్రామాల్లో శనివారం పప్పుశనగ పంటకోత ప్రయోగాలను ఏడీఏ చెంగళరాయుడు ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారులు చేపట్టారు. ఈ సందర్భంగా పుట్లూరులో 1.10 కిలోలు, కోమటికుంట్లలో 0.78 కిలోలు, కడవకల్లులో 1.10కిలోల దిగుబడి వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ కత్యాయని, ఏఈఓ హరి, సిబ్బంది సర్ఫరాజ్, మనోరమ, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని శ్రీసాయిలక్ష్మి మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామని నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న ఆస్పత్రిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పొలాలకు వెళ్లే రస్తా కబ్జా చేశారని ధర్నా



ధర్నా చేస్తున్న దృశ్యం

గుత్తి రూరల్: పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డులో ఉన్న శ్రీ సాయి డిగ్రీ కళాశాల పక్కన నుంచి పొలాలు, ప్లాట్లకు వెళ్లే దారిని కొందరు కబ్జా చేసి అక్రమ కట్టడాలు కట్టారని రైతులు, ప్లాట్ల యజమానులు ధర్నా చేశారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట వారు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు, ప్లాట్ల యజమానులు నాగయ్య, ప్రసాద్, గోవిందు, పెద్దయ్య మాట్లాడుతూ సర్వే నంబర్ 537–డీలో ఆర్ఎస్ రోడ్డు నుంచి సూరశింగనపల్లి, చెట్నేపల్లి పొలాలు, ప్లాట్లకు వెళ్లేందుకు బండి రస్తా ఉండేదన్నారు. అయితే ఇటీవల ఓ వ్యక్తి రోడ్డుకు పక్కన స్థలం కొనుగోలు చేసి బండి రస్తాపై కంచె వేసి అక్రమంగా నిర్మాణాలు చేపట్టారన్నారు. తమకు రస్తా చూపాలని వారు వినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ ఓబిలేసుకు వినతి పత్రం అందజేశారు. తహసీల్దార్ స్పందించి రెవెన్యూ సిబ్బందితో సర్వే చేయించి పొలాలు, ప్లాట్లకు రస్తా చూపుతామని వారికి హామీ ఇచ్చారు.

కన్నీరే మిగిలింది!



- నష్టాలను మిగిల్చిన ఖరీఫ్, రబీ
- అప్పుల ఊబిలో రైతన్నలు
- ప్రభుత్వం ఆదుకోవాలంటూ వేడుకోలు

కంది పంట నూర్పిడి చేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లలో సాగుచేసిన పంటలన్నీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోవడంతో రైతులకు కన్నీరే మిగిలింది. కనీసం పెట్టుబడి డబ్బులు కూడా చేతికి అందక అప్పుల్లో కూరుకుపోయారు. కూటమి ప్రభుత్వం ముందుగా ప్రకటించిన విధంగా పంటల బీమా నగదునైనా ఖాతాల్లో జమచేస్తే కొంత మేర కష్టాలు తీరుతాయని కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు. గుంతకల్లు మండలంలో దాదాపు 75 వేల ఎకరాల సాగు భూమి ఉండగా ఇందులో దాదాపు 60 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో పంటలు సాగవుతున్నాయి. గతంలో ఖరీఫ్ సీజన్‌లో ఒక్క వేరుశనగ పంటనే దాదాపు 45 వేల ఎకరాలకు పైగా సాగు చేసేవారు. కానీ తీవ్రమైన వర్షాభావం, వరుస పంటనష్టాలను ఎదుర్కొంటూ వచ్చిన రైతన్నలు క్రమంగా వేరుశనగ సాగు విస్తీర్ణం తగ్గించి కంది సాగుపై మొగ్గుచూపుతూ వచ్చారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే మంచి వర్షాలు పడటంతో రైతులు దాదాపు 20 వేల ఎకరాల్లో వేరుశనగ పంటను, మరో 25 వేల ఎకరాల్లో కందిపంట సాగు చేశారు. పంటసాగు అనంతరం కొద్దిరోజుల పాటు వర్షాభావ పరిస్థితులు వెంటాడటంతో సాగు చేసిన వేరుశనగ క్రమంగా వాడుముఖం పట్టి సగానికి పైగా పంట దెబ్బతింది. అదే సమయానికి అకాల వర్షాలు పడటంతో అంతంత మాత్రంగా ఉన్న వేరుశనగ పంట కూడా చేతికి అందకుండా పోయింది.

తగ్గిన దిగుబడులు..

ఎకరానికి దాదాపు 7 క్వింటాళ్ల దిగుబడి రావాల్సిన వేరుశనగ ఈ ఏడాది ఎకరాకు కనీసం రెండు క్వింటాళ్ల దిగుబడి కూడా రాలేదు. దీంతో వేరుశనగ పంటను సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. మరో వైపు అక్టోబర్, నవంబర్‌లో కంది పంట పూత దశలో ఉన్న సమయంలో వరుస తుపాను వర్షాల తాకిడికి పూత రాలిపోవడంతోపాటు, కాయ నల్లగా మారి, పురుగు పట్టింది. దీంతో ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి రావాల్సిన కందిపంట కనీసం ఎకరాకు 2 క్వింటాళ్ల దిగుబడి కూడా రాకుండా పోయింది. ఈ ఏడాది రబీ సీజన్‌లో 1500 ఎకరాల్లో పప్పుశనగ సాగు చేశారు. ఓ వైపు తుపాను, మరో వైపు మంచు కారణంగా పంటపై ఉన్న పులుసు పూర్తిగా కారిపోయి దిగుబడితోపాటు కాయ నాణ్యత కూడా తగ్గిపోయింది. ఎకరాకు 7 క్వింటాళ్లకు పైగా దిగుబడి రావాల్సిన పప్పుశనగ సైతం ఈ ఏడాది ఏ రైతుకూ రెండు క్వింటాళ్లకు మించి దిగుబడి అందకుండా పోయింది. అటు ఖరీఫ్, ఇటు రబీ రెండు సీజన్‌లలోనూ తీవ్రమైన పంట నష్టం రావడంతో అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతన్నలు దిక్కుతోచని స్థితిలో కృంగిపోయారు. చేతిలో చిల్లిగవ్వలేక కుటుంబ పోషణ కూడా కష్టంగా మారిన ప్రస్తుత తరుణంలో క్రాఫ్ ఇన్సూరెన్స్ నగదునైనా తమ ఖాతాల్లో జమచేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఇంతటి నష్టం ఎప్పుడూ చూడలేదు..



ఎకరాకు రూ.20 వేల వరకూ ఖర్చు చేసి నాలుగు ఎకరాల్లో ఈ ఏడాది కంది పంట సాగు చేశా. ఐదు అడుగులకు పైగా ఎత్తుపెరిగిన కంది పంటను చూసి కష్టాలు తీరిపోతాయని ఆశపడ్డాం. పంట మంచి పూత దశలో ఉన్న సమయంలో వరుస తుపానులు రావడంతో పూత పూర్తిగా రాలిపోయింది. దిగుబడి తగ్గిపోవడమే కాకుండా గింజ నాణ్యత లేక నష్టం వాటిల్లింది. – సోమశేఖర్, రైతు, కసాపురం

మూడు ఎకరాలకు మూడు క్వింటాళ్లు



ఎకరాకు రూ.20 వేల దాకా ఖర్చుపెట్టి ఈ ఏడాది మూడు ఎకరాల్లో కందిపంటను సాగు చేశా. అకాల వర్షాలకు తోడు తుపాన్లు కూడా తోడవడంతో పంట పూర్తిగా ఎత్తిపోయింది. చివరకు మూడెకరాలకు కలిపి మూడు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కనీసం పెట్టుబడి పెట్టిన నగదు కూడా చేతికి అందక రైతుల జీవితం దుర్భరంగా మారింది. – కదిరప్ప, రైతు, నల్లదాసరపల్లి

బీమా అందజేయాలి



తుపాను వర్షాల కారణంగా ఈ ఏడాది రైతులు సాగు చేసిన ప్రతి పంట నష్టాన్నే మిగిల్చింది. నాకున్న నాలుగు ఎకరాల్లో కందిపంటను సాగు చేయడానికి రూ.80 వేల వరకూ ఖర్చు పెడితే 30 వేలు కూడా అందేలా లేదు. చేసిన అప్పు ఎలా తీర్చాలో కూడా తెలియడం లేదు. ప్రభుత్వం స్పందించి బీమా అందజేయాలి. – రామచంద్రనాయక్, రైతు, పులగుట్టపల్లి పెద్దతండా

చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

పెద్దవడుగూరు: చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పెద్దవడుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు శ్రీనివాసబాబు సూచించారు. శనివారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భోజనం చేసే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. రోజూ పౌష్టికాహారం తీసుకోవాలాన్నరు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

బుక్కరాయసముద్రం: గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని యూనివర్సల్ ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని వీరభద్ర కాలనీలో ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆయన ముందుగా రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మాతా శిశు మరణాలు తగ్గించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సుబ్రమణ్యం, జ్యోతి, పుష్పలత, క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

గుత్తి: పట్టణంలోని ఓల్డ్ సీపీఐ కాలనీలో ఉన్న సుంకులమ్మ అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గౌరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పిల్లలు, గర్భిణులు, బాలింతల రికార్డులు పరిశీలించారు. పౌష్టికాహారం పంపిణీపై ఆరా తీశారు. సకాలంలో పౌష్టికాహారం పంపిణీ చేయాలని, సమయపాలన పాటించాలని అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాలను ఆదేశించారు. లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సూపర్‌వైజర్ హెచ్చరించారు.

29న మండల సమావేశం

గార్లదిన్నె: మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో ఈ నెల 29న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సమావేశానికి అధికారులు, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు తప్పక హాజరుకావాలన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కక్ష సాధింపు



గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన పత్రాలు చూపుతున్న బాధితులు

బుక్కరాయసముద్రం: మండలంలోని చెదుల్ల గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ భాస్కర్ మండిపడ్డారు. శనివారం బీకేఎస్ మండల కేంద్రంలో బాధితులతో కలసి వారు విలేకరులతో మాట్లాడారు. చెదుల్ల గ్రామంలో నివాసం ఉంటున్న వన్నూరప్ప వారి తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూమికి అప్పటి సీఎం గా ఉన్న కిరణ్ కుమార్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో పట్టా ఇచ్చారన్నారు. ఆ పొలం పక్కనే ఉన్న బంధువు అయిన పోతప్ప, ఆయన కుటుంబ సభ్యులు టీడీపీ నాయకుల ప్రోద్బలంతో వన్నూరప్పతో గొడవలకు పాల్పడుతున్నారు. 12 ఏళ్ల క్రితం ఆ భూమిలో మామిడి తోటలో పూడ్చి బావిని తవ్వించేలా కుట్రలు చేశారన్నారు. చెట్లను ధ్వంసం చేశారన్నారు. గ్రామంలో కక్షలు రేగేలా టీడీపీ నాయకులు చిచ్చు పెడుతున్నారన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో చికెన్ నారాయణ స్వామి, వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలి



గుంతకల్లులో ర్యాలీ ప్రారంభిస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్



తాడిపత్రిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



శింగనమలలో బహుమతులందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్/గుంతకల్లు టౌన్/తాడిపత్రి టౌన్/తాడిపత్రి అర్బన్/తాడిపత్రి రూరల్/ పెద్దవడుగూరు/ శింగనమల/పుట్లూరు/గార్లదిన్నె: ఓటు హక్కు అనేది సామాన్యుడి చేతిలో వజ్రాయుధం లాంటిదని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ శ్రీనివాస్ సూచించారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్డీఓతోపాటు డీఎల్‌డీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ రమాదేవి ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల విద్యార్థులతో కలసి గుంతకల్లులోని ఆర్డీఓ కార్యాలయం నుంచి కసాపురం రోడ్డులోని రామలింగయ్య కాంప్లెక్స్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారంగా ఏర్పడి ఓటుహక్కు ప్రతిజ్ఞ చేశారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఓటుహక్కు చాలా విలువైనదని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రంగోలి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులందజేశారు. అనంతరం సీనియర్ సిటిజన్ ఓటర్లను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అలాగే గుంతకల్లు, తాడిపత్రి,పెద్దవడుగూరు, శింగనమల, పుట్లూరు, గార్లదిన్నె, పామిడి మండలాల్లో ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణ కాలేజీపై కేసు నమోదు చేయాలి



అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

గుంతకల్లుటౌన్: ఇంటర్ విద్యార్థి చరణ్ ఆత్మహత్యకు కారణమైన నారాయణ కాలేజీ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్‌నాయక్, పట్టణ కార్యదర్శి శివమణిలు డిమాండ్ చేశారు. కార్పొరేట్ కాలేజీల ఆగడాలకు అడ్డుకట్ట వేయడంలో వైఫల్యం చెందిన రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ శనివారం అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఏఐఎస్ఎఫ్ నాయకులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతపురంలో నారాయణ కాలేజీ యాజమాన్యం వేధింపులు తాళలేక ఒక విద్యార్థి భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై విచారణ చేసి చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆర్ఐఓ వెంకటరమణను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కాలేజీ యాజమాన్యంపై చర్యలు చేపట్టకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఫర్హాన్, సమీర్, జయరామ్, ముస్తఫా, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మాంసపు దుకాణాలు మూసేయాలి

గుంతకల్లుటౌన్: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా పట్టణంలోని జంతువధశాలలు, మాంసపు దుకాణాలు, నాన్ వెజ్ హోటళ్లు మూసివేయాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ సూచించారు. నిబంధనలు ఉల్లంగిస్తే జరిమానా విధించినున్నట్లు ఆయన శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

యాడికి: రెవెన్యూ సదస్సులో వచ్చిన సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, రీసర్వే అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ మండలంలో చేపడుతున్న రీ సర్వేపై రైతులకు అవగాహన కల్పించి ఎటువంటి సమస్యలకు తావివ్వకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, డీటీ శ్రీనివాసులు, రీ సర్వే డీటీ రాజ్ కుమార్, రెవెన్యూ, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఘనంగా పర్యాటక దినోత్సవం

గుత్తి: గుత్తిలోని అనంతపురం రోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ కాలేజీలో శనివారం జాతీయ పర్యాటక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుత్తి కోట సంరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడారు. గుత్తి కోటను పర్యాటక కేంద్రంగా చేయాలన్నారు. కోట సంరక్షణ సమితి సభ్యులు వెంకటరామిరెడ్డి, తిమ్మారెడ్డి, ప్రిన్సిపాల్ లతాదేవి, ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి మునిసిపల్ బడ్జెట్ రూ.101 కోట్లు



వైస్ చైర్మన్లను సన్మానిస్తున్న దృశ్యం

తాడిపత్రి రూరల్: 2025–26 మునిసిపల్ బడ్జెట్ రూ.101,75,97,000గా కౌన్సిల్ తీర్మానించింది. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో శనివారం తాడిపత్రి మునిసిపల్ బడ్జెట్‌పై సమావేశం నిర్వహించారు. సమావేశానికి మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్దుల్ రహీం అధ్యక్షత వహించారు. ప్రారంభ నిల్వ రూ.31,72, 19,000 కలుపుకుని బడ్జెట్ అంచనా వేశారు. అనంతరం మరో వైస్ చైర్‌పర్సన్ సరస్వతి అధ్యక్షతన అజెండాలోని 11 అంశాలపై తీర్మానాన్ని ఆమోదించారు. అనంతరం పదవులకు రాజీనామా చేసిన వైస్ చైర్మన్లను జేసీ ప్రభాకర్‌రెడ్డి శాలువాలతో సన్మానించారు. మునిసిపాలిటీ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని వారిని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఫయాజ్‌బాషా, అకుల నాగిరెడ్డి తదితరులు హాజరయ్యారు.

సర్టిఫికెట్ల పరిశీలన నిష్పక్షపాతంగా నిర్వహించండి

గుంతకల్లుటౌన్: దివ్యాంగుల సదరం సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించి, అర్హులందరికీ న్యాయం జరిగేలా చూడాలని ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్ రెడ్డి, డాక్టర్ మల్లికార్జునను సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు కోరారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో జరుగుతున్న అంధత్వ నిర్ధారణ పరీక్షలు, సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమాన్ని నాయకులు పరిశీలించారు. పింఛన్‌ల కోత విధించాలన్న ప్రభుత్వ ఒత్తిళ్ల మేరకు అర్హులను కూడా అనర్హులుగా గుర్తిస్తే ఉద్యమాలు చేపడుతామని ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి సురేష్ హెచ్చరించారు. పార్టీ నాయకులు సత్తార్, రామాంజనేయులు, విశ్వనాథ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంతోనే రోడ్డు ప్రమాదాలు: ఏఎస్పీ



ర్యాలీ నిర్వహిస్తున్న అడిషనల్ ఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి, పోలీసులు

యాడికి: నిర్లక్ష్యంతో వాహనం నడిపి ప్రమాదానికి గురైతే కుటుంబం మొత్తం రోడ్డున పడుతుందని ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక పాత పోలీస్‌స్టేషన్ నుంచి గాంధీ కూడలి వరకూ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డ్రైవర్లు మద్యం సేవించి, ఫోన్‌లో మాట్లాడుతూ అతి వేగంగా వాహనాలు నడుపుతుండటంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అనంతరం రహదారి భద్రతకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అంతకుమునుపు ఏఎస్పీ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ప్రజలు ప్రతి చిన్న విషయానికి 100కు ఫోన్ చేస్తున్నారని, స్థానిక పోలీస్‌స్టేషన్ నంబర్‌ను ప్రతి గ్రామంలో ప్రజలకు తెలిసేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐ ఈరన్న, ఎస్ఐ రమణ, ఏఎస్ఐ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి మసూద్ గాజీ దర్గా ఉరుసు



మసూద్ గాజి సమాధి

శింగనమల: జిల్లాలో హిందూ–ముస్లిం ఐకతకు నిదర్శనంగా నిలిచిన శింగనమలలోని హజరత్ సయ్యద్ సాలర్ మసూద్ గాజి అజ్మీరి రహ్మతుల్లా అలైహి ఉరుసు మహోత్సవం మూడు రోజులు పాటు అత్యంత వైభవంగా నిర్వహించడానికి దర్గా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉరుసు మూడు రోజులు పాటు హిందువులు, ముస్లింలు నిర్వహించనున్నారు. దర్గా ముజావర్ అబ్దుల్ ఖాదర్, సర్పంచ్ నాగమునెమ్మ ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభించనున్నారు. కాగా శింగనమలలో ఏ ఇంట శుభకార్యం జరగాలన్నా మొదట దర్గాలో చక్కెర చదివిస్తారు. అలాగే ప్రతి గురువారం మతాలకు అతీతంగా భక్తులు దర్గాకు వచ్చి చక్కెర చదివించడం అనవాయితీ.

ఉరుసు కార్యక్రమాలు ఇలా..

ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకూ ఉరుసు మహోత్సవం నిర్వహిస్తున్నారు. 27న గంధం కార్యక్రమం నిర్వహిస్తారు. ఆ రోజు రాత్రి 8 గంటల నుంచి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. రాత్రి 9.30 గంటల నుంచి 1 గంట వరకు మౌలానా హాఫీజ్ ప్రసంగం ఉంటుంది. ఆ తరువాత పూలచాందిని తయారుచేస్తారు. పూలచాందినిని అలంకరించిన తరువాత రాత్రి 1.30 గంటలకు పూల చాందిని (గంధం) దర్గా నుంచి బయలుదేరి ముల్లా సాదిక్ ఇంటికి చేరి, అక్కడి నుంచి గ్రామంలో ఊరేగిస్తారు. ఈసందర్భంగా పక్కీర జల్సాలు, కత్రసాము విన్యాసాలు, మంగళవాయిద్యాలు, విద్యుత్ అలంకరణలతో గంధం ఊరేగింపు చేస్తారు. 28వ తేదీ ఉదయం 6 గంటలకు పూలచాందిని దర్గాకు చేరుకుంటుంది. అక్కడ చదివింపుల తరువాత, భక్తులు మొక్కుబడులు చెల్లిస్తారు. అదేరోజు ఉరుసు మహోత్సవం నిర్వహిస్తారు. ఉరుసుకు వచ్చిన భక్తులకు అన్నదానం చేస్తారు కందురోత్సవ కార్యక్రమం వంటివి భక్తులు చేపడుతారు. రాత్రి ఖవ్వాలీ నిర్వహిస్తారు. 29న జియారత్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆరోజు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. అనంతరం జియారత్ ఫాతెహా జరుగుతుందన్నారు. రాత్రి 10 గంటలకు డీఆర్ ఈవెంట్స్ వారిచే తెలుగు, హింది పాటల కచేరీ (ఆర్కెస్ట్రా) నిర్వహిస్తారు. ఉరుసు సందర్భంగా గట్టి బందోబస్తు చర్యలను చేపట్టనున్నట్లు సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

హెచ్‌పీ గ్యాస్ ఫ్యాక్టరీలో మాక్ డ్రిల్



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందం

బుక్కరాయసముద్రం: మండలంలోని వడియం పేటలో ఉన్న హెచ్‌పీ గ్యాస్ ఫ్యాక్టరీలో కర్నూలు లోని ఎన్‌డీఆర్ఎఫ్ బృందం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీల డిప్యూటీ చీఫ్ ఇన్స్‌పెక్టర్ చెన్నకేశవులు మాట్లాడుతూ విపత్తు, ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఫ్యాక్టరీలలో పని చేసే సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్యాస్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌డీఆర్ఎఫ్ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారి శ్రీధర్, సహాయ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ అసిస్టెంట్ అధికారి లింగమయ్య, డీపీఎం ఏపీఎస్‌డీఎంఏ అధికారి ఆనంద్, ఇండస్ట్రియల్ ప్రమోహనల్ అధికారి భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.